# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


## సింహవాహనంపై శ్రీ ముత్తుమారెమ్మ ఊరేగింపు



కుప్పం, మే 17 ప్రభాతవార్త

కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతరలో భాగంగా శనివారం రాత్రి శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ ఉత్స వాన్ని నిర్వహించారు. తొలుత ఆల యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రెండు సింహ వాహనాలపై అమ్మవారిని పాతపేట, నేతాజీరోడ్, కొత్తపేట ప్రాంతాల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు. రాత్రి కుప్పం బస్టాండు వద్ద ప్రముఖ గాయకులు మల్లికార్జున్, సాయిచరణ్,పార్థసారథి, ఉమా నేహ, హరిణి, సాహితల బృందంచే పాటకచ్చేరి నిర్వహించారు.

## శ్రీవాణి ట్రస్ట్ నిధులతో మరింత మెరుగ్గా ఆలయాల నిర్వహణ :ఇఓ



తిరుమల,మే 17 ప్రభాతవార్తప్రతినిధి: సనాతన హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా జనంలోకి తీసుకెళ్ళేందుకు, శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబం ధనలను పున:సమీక్షించుకుని మరింత మెరుగ్గా, పారదర్శకంగా ఉండేలా ప్రణాళి కలు తయారుచేయాలని టిటిడి ఈఓ జె.శ్యామలరావు అధికారులకు ఆదేశిం చారు. నిరాదరణకు గురైన ఆలయాల ధూపదీపనైవేద్యాల నిర్వహణకు ప్రణాళికలు,వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణకోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలనభవనంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జఈఓ వీరబ్రహ్మంతో కలసి శ్రీవాణి ట్రస్ట్‌పై సమీక్షించారు.

# షార్ అంతా బిజీ బిజీ

- రాకెట్ ప్రయోగం.. రాజకీయ నేతలు.. రక్షణ ఏర్పాట్లు
- నేటి ఉదయం 5.59 గంటలకే పిఎస్ఎల్‌వి-సి61 నింగికి
- 22 గంటల కౌంట్‌డౌన్ తర్వాత ప్రయోగం జరపనున్న ఇస్రో
- ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు













శ్రీహరికోట (తడ), మే 17 ప్రభాతవార్త

శ్రీహరికోట బిజీబిజీగా మారింది. రాకెట్ ప్రయోగ సమయంలోనే కేంద్ర పార్లమెంటరీ స్థాయి కమిటీ సభ్యుల బృందం ఇక్కడికి రావడంతో శాస్త్రవేత్తలు, అధికారులు రెండు వైపులా విధులు నిర్వ హించాల్సి వచ్చింది. శనివారం 16మంది ఎంపీలు శ్రీహరికోటలో దశల వారీగా పర్యటనకు విచ్చేశారు. వారికి ఇస్రో ఛైర్మన్ వి.నారా యణన్‌తో పాటు షార్ డైరెక్టర్ రాజరాజన్ తదితరులు స్వాగతం పలికారు. నక్షత్ర అతిథిగృహంలో కీలక సమావేశాలు జరిపారు. అనంతరం ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్‌ను మొదటి ప్రయోగ వేదిక వద్ద దూరంగా పరిశీలించారు. రెండో ప్రయోగ వేదికతో పాటు రాకెట్ అనుసంధాన భవనాలు, మిషన్ కంట్రోల్ సెంటర్, మరికొన్ని ప్రదేశాలను వీక్షించారు. ఇదిలావుంటే శనివారం ఉదయం సరిగ్గా 7.59 గంటలకు పిఎస్ఎల్‌వి సి-61 రాకెట్ ప్రయోగానికి సంబంధించి కౌంట్‌డౌన్ మొదలైంది. 22 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ విజయవంతంగా జరిపి, ఆదివారం ఉదయం 5.59 గంటలకు శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఇఓఎస్09 పేరుతో నిర్మించిన ఈ రక్షణ రంగ ఉపగ్రహం సరిహద్దుల భద్రతకు సైనికులకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఒకవైపు రక్షణ ఉపగ్రహ ప్రయోగం జరుగుతుండగా మరో వైపు శ్రీహరికోట రక్షణను కూడా సిఐఎస్ఎఫ్ దళాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అడుగడుగునా తనిఖీలతో భద్రత బలగాలు మోహరించాయి. ఇటీవలి పరిణామాలతో ముందుగానే మాక్‌డ్రిల్ వంటివి నిర్వహించిన వందలాది మంది సిఐఎస్ఎఫ్ పోలీసులు, తిరుపతి జిల్లా పోలీసులు భద్రత ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేస్తున్నారు.

సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలో అడుగడుగునా తనిఖీలు ఉన్నాయి. ఈ సారి రాకెట్ ప్రయోగ వీక్షణ కోసం వేలాదిగా తరలివచ్చే సందర్శకులకు కూడా అవకాశం కల్పించలేదు. ఈ రాకెట్ ప్రయోగాన్ని నేరుగా వీక్షించేందుకు పార్లమెంటరీ కమిటీ బృందం ఆదివారం ఎన్‌సిసికి రానున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి శాస్త్రవేత్తలు, సీనియర్ అధికారులతో కలిసి రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తారు. ఇఓఎస్09 ఉపగ్రహాన్ని 18 నిమిషాల్లోపే రాకెట్ అంతరిక్షంలోని కక్ష్యకు చేర్చాల్సి ఉంది. ఆ తర్వాత మరో 83 నిమిషాలకు రాకెట్ నాలుగవ దశను ఇంకో కక్ష్యలో చేర్చాల్సి ఉంది. ఈ 101వ రాకెట్ ప్రయాణం 101 నిమిషాల పాటు కొనసాగుతుండటం విశేషం. ప్రస్తుతం దేశంలోని అందరి చూపులు షార్ కేంద్రంపైనే ఉన్నాయి. అత్యద్భుత ఉపగ్రహ ప్రయోగం వలన ఎన్నో ఉపయోగాలు ఉంటాయని ఈ ప్రయోగ విజయం దేశానికి ఎంతో అవసరమని పలువురు అంటున్నారు.

### సూర్య,చంద్రులపై భక్తులకు అభయమిచ్చిన

# కల్యాణ వేంకటేశ్వరుడు

### నేడు కల్యాణ వేంకన్న రథోత్సవం





నారాయణవనం, మే 17 ప్రభాతవార్త :

నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్స వాలకు సంబందించి కల్యాణ వేంకటేశ్వరుడు ఏడవ రోజు శనివారం ఉదయం సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 7గంటలకు కల్యాణ వేంకటేశ్వ రున్ని చంద్రప్రభవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాండనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై అధిరోహించి మాడవీధి, మెయిన్‌రోడ్డు, కొత్తబజారువీధి, పాత బజారువీధి, ఎగువ, దిగువపద్మాశాలీ వీధి, తేరువీధుల్లో ఊరేగిన తర్వాత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. స్నపనతిరుమంజనం చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్బంగా అన్నమయ్య సంకీర్తలను వినిపించారు. రాత్రి 7గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి నగరు వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం, చెక్కభజనల నడుమ శ్రీవారు భక్తులకు అభయమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపర్‌టెండెంట్ ధర్మయ్య, సివిల్ ఇంజనీరింగ్ ఎఇఇ గురుప్రసాద్, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, నరసింహరాఘవ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కల్యాణ వేంకటేశ ్వరుని బ్రహో ్మత్స వాలో ్ల భాగంగా ఆదివారం ఉదయం రథోత్స వ కార ్యక్రమం

## టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

### చిత్తూరు కమీషనర్, సిసిలకు గాయాలు





చంద్రగిరి, మే 17 ప్రభాతవార్త:

టైరు పేలడంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో చిత్తూరు నగరపాలక సంస్థ కమీషనర్ నరశింహ ప్రసాద్, సిసి డి.అమర్‌నాథ్ రెడ్డి గాయాలపాలయ్యారు. చిత్తూరు నుండి తమ విధులు ముగించుకుని కారులో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై తిరుపతికి వస్తుండగా గాదంకి టోల్‌ప్లాజా సమీపంలో కారు టైరు పేలింది. దీంతో కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టి బోల్తా కొట్టింది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో ఇదే మార్గంలో తిరుపతి వస్తున్న పూతలపట్టు ఎంఎల్‌ఏ డాక్టర్ మురళిమోహన్ వీరిని గమనించి హుటాహుటిన తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. డ్రైవర్ ప్రవీణ్ ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

## మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత అందరిది

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరురూరల్, మే 17 ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ, మున్సిపాల్టీల పరిధిలోని కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతున్నదన్నారు. వాతావరణ కాలుష్య నియంత్రణకు పచ్చదనం ఎంతో ఉపయోగపడుతుందని, మొక్కల పెంపకం పర్యావరణంను కాపాడటంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కాపాడుకోవడంలో ముఖ్యమన్నారు. వాతావర ణంలో మార్పులను తగ్గించడంలో మొక్కలు ఉపయోగపడుతాయని, సూర్యుడి నుండి వచ్చే రేడియేషన్ తగ్గించడానికి ఉపయోగపడుతాయని, తద్వారా చర్మ కాన్సర్ వంటి వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపులో భాగంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించడం వ్యక్తిగత బాధ్యతగా ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతంను పరిశీలించి కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా వుంచడంతో పాటు పచ్చదనం పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలో పచ్చదనం పెంచడానికి తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా డిఆర్ఓ మోహన్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ కులశేఖర్, ఎలక్షన్ సెల్ సూపరిటెండెంట్ వాసుదేవన్, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరిటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు

## పిడుగుపాటుకు.. భగ్గుమన్న సెల్ టవర్...



రేణిగుంట మే 17 ప్రభాతవార్త

రేణిగుంట స్మశానానికి వెళ్లే మార్గంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ శనివారం సాయంత్రం పిడుగుపాటుకు షార్ట్ సర్క్యూట్ అయి మండుతుంది. వివరాలు ఇలా... శనివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై పది నిమిషాలు భారీ వర్షం కురిసింది. వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో స్మశానానికి వెళ్లే మార్గంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ టవర్ పై పిడుగు పడింది. పిడుగుపాటుకు సెల్ టవర్ వైర్లు మండుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు పొగలు వ్యాపించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న రేణిగుంట అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలం చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలం చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సెల్ టవర్తోపాటు జియో కు చెందిన రిసీవింగ్ యూనిట్ అనుసంధానమైనట్లు సమాచారం.

## వైభవంగా రథోత్సవం



గుడుపల్లి,మే ,17 ప్రభాతవార్త

మండలంలోని యామగానిపల్లిలో వెలసిన శ్రీద్రౌపతి సమ్మేత ధర్మ రాజుల స్వాములవారి మహాభారత ఉత్స వాలలో భాగంగా శనివారం రథోత్స వం మరియూ అర్జునుడు ఆవులు త్రిప్పుట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.రథోత్స వం కార్యక్రమం అతి వైభవంగా నిర్వహించారు,రథోత్స వాన్ని తిలకించేందుకు మండలంలోని అన్ని గ్రామాలనుండి కర్నాటక,తమిలనాడు ప్రాంతాలనుండి కూడా ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు.అనంతరం అర్జునుడు ఆవులు త్రిప్పుట కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్రమాన్ని చూసేందుకు ప్రజలు తరలి వచ్చారు.చుట్టుప్రక్కల గ్రామాలనుండి కాకుండా ఇతర ప్రాంతాలనుండి కుడా ఆవులను తీసుకువచ్చి ఈకార్యక్రమంలో పాల్గోన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్య క్రమంలో భక్తాదులు,ఆలయ కమిటీ ప్రజలు పాల్గోన్నారు.

## స్వచ్ఛతిరుమలకు స్థానికుల సహకారం అవసరం

### -అదనపు ఈఓ వెంకయ్య చౌదరి



తిరుమల,మే 17ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల పుణ్యక్షేత్రం పరిశుభ్రత బాధ్యత మనందరిదని, ఇక్కడకు వచ్చే యాత్రికులు కూడా స్వచ్ఛతిరుమలకు సహకరించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు. కొండ పరిశుభ్రత కాపాడుకోవాల్సిన అవసరం స్థానికులపై కూడా ఉందన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఉదయం తిరుమలలోని బాలాజీనగర్‌లో స్వచ్ఛతిరుమల కార్యక్రమం చేపట్టారు. డిప్యూటీ ఈఓ సోమన్‌నారాయణన్,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, ఆరోగ్యఅధికారి మధుసూదన్,విఎస్ఓ సురేంద్ర,ఆరోగ్యవిభాగం సిబ్బంది,వ్యాపారులు పాల్గొన్నారు.

# తిరంగా ర్యాలీతో దద్దరిల్లిన శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి,మే 17 ప్రభాతవార్త

దేశం కోసం ప్రాణాలనుసైతం లెక్కచేయక పోరాటాలు చేస్తున్న వీర జవాన్ల సేవలను ఎంత పొగిడినా తక్కువే అని స్థానిక శాసనసభ్యుడు బబొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.దేశంలో ఉగ్రవాదాన్ని తుదముట్టించటంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ సాహసం మాటల్లో చెప్పలేమని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. శనివారం శ్రీకాళహస్తిలో భారీ ఎత్తున 'తిరంగా ర్యాలి'ని నిర్వహిం చారు. బేరివారి మండపం వద్ద శనివారం ర్యాలిని ప్రారంభించిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పిలుపు మేరకు నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలు జాతీయ సమైక్యతను చాటు తుందన్నారు. బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ దేశ భద్రత విషయంలో ప్రధాని తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టిం చుటకు దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో భారతసైన్యం చూపుతున్న సాహసం దేశ భక్తిని చాటుతుందన్నారు. మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.ఆయన ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు.



భారీ ర్యాలీ

ఉమ్మడి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం సాయంత్రం తిరంగా ర్యాలిలో ప్రజలు,విద్యార్థులు,వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సింధూర మిషన్ విజయవంతంపై వాడ వాడల్లో తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తిలో నిర్వహించారు. నాలుగుమాడావీధుల్లో జాతీయ జెండాలను చేతబట్టుకొని ప్రదర్శనలు జరిపారు.ర్యాలి బేరివారి మండపం నుంచి ప్రారంభమై బజారు వీధి, తేరువీధి, నెహ్రూ వీధి, నగరి వీధులమీదుగా సాగింది.ఈ ర్యాలిలో ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, బిజెపి నాయకులు కోలా ఆనంద్‌కుమార్, బి.చంద్రప్ప తుడా ఛైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి,వియకుమార్, రంగినేని చెంచయ్యనాయుడు, రెడ్డి వారి గురువారెడ్డి, జి.ధశరధాచ్చారి, మిన్నల్‌రవి, డాక్టర్ యం.ఉమేష్‌రావు, వజ్రం కిషోర్, పేట బాలాజిరెడ్డి, మునిరాజాయాదవ్,వాకచర్ల గుర్రప్పశెట్టి, డివి.నారాయణ, రాకేష్, దొరైరాజ్‌రెడ్డి, మునెయ్య,సుబ్రమణ్యం రెడ్డి,మహిళా నాయకులు బొజ్జల బృందమ్మ,కంద్రిగ ఉమ, బి.రేణుకాదేవి, మల్లీశ్వరి,నాగమల్లి దుర్గా ప్రసాద్, నెమళ్ళూరు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

### - కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి కార్పొరేషన్, మే 17, ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. మూడవ శనివా రం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ధ హీట్ నినాదంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎండ తీవ్ర తలను తగ్గించేలా మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు, పశు పక్ష్యాదుల కొరకు నీటి తొట్టెల ఏర్పాటు, పారిశుద్ధ్య కార్మి కులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, టోపీలను అందజేశారు. ప్రజలు, ఉద్యోగులు అందరూ వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా నాలుగు నెలల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈ నెల బీట్ ధ హీట్ నినాదంతో ఎండ వేడిమి నుండి ఉపశమనం కలి గేలా పాల కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు అన్నా అనిత, రేవతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్‌లో సత్తా చాటిన సైనికులు

### ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మే 17 ప్రభాతవార్త :

ఆపరేషన్ సింధూర్‌లో భారతీయ సైనికులు తమ సత్తా చాటారని ఎమ్మె ల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. కేవలం రెండు రోజుల్లోనే భారతీయ సైన్యం ధాటికి పాకిస్థాన్ భయపడిపోయిందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో పోరాడిన భారత సైన్యానికి సంఘీ భావంగా పట్టణంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక టర్కీ,చైనా మద్దతు వున్న పాకిస్తాన్‌ను భారతదేశం ఒక్కటే చిత్తు చేసిందన్నారు. ఈ యుద్ధం ద్వారా భారతదేశ రక్షణ వ్యవస్థ గొప్పతనం ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికుల వెంట దేశం మొత్తం నడుస్తుందని తెలిపారు. దేశ ప్రజల రక్షణ కోసం పోరాడుతున్న సైన్యానికి రుణపడి వుంటామని తెలిపారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిధరాజు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో సైనికులు చేసిన త్యాగం వెటకట్టలేనిదన్నారు. దేశం మొత్తం జవాన్ల వెంటే వుందన్నారు. దీనికి ముందు హిమజ స్కూలు నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ నిషిధరాజు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి స్వాగతం



**తిరుపతి(రవాణ), మే 17(ప్రభాతవార్త:** తిరుమల పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి శని వారం ఉదయం రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం లభిం చింది. బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, బిజెపి నాయకులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, దేశనాగేశ్వరరావు, మల్లారపు రవిప్రసాద్, మురళి, జనసేననాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, సుభాషిణి, రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. దుశ్శాలువతో సత్కరించార. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని మంత్రి నేతలకు సూచించారు.

## రంగస్థలి భజనలతో నగరం భక్తిభావం



**తిరుపతి(రవాణ), మే 17(ప్రభాతవార్త:** మోక్షమార్గం పొందడానికి హరినామస్మరణ, హరినామసంకీర్తన సులువైన మార్గమని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువ జామున తిరుపతిపుణ్యక్షేత్రంలో రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో భక్తిభావం చాటింది. శనివారం వేకువజామున రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుశీల, మునికుమారి, పద్మ, కల్పన, ఉషారాణి, భారత్, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాథరెడ్డి, కస్పాపద్మనాభం, శాంభోలు హరినాథ్, పొన్నాలజెజిరెడ్డి, నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి వాసు, సాయిరెడ్డి తదితరులు తిరునామం ధరించి భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## షుగర్ వ్యాధి గ్రస్తులకు వ్యాధి పట్ల అవగాహన అవసరం



**తిరుపతి హెల్త్, మే 17 ప్రభాతవార్త :** షుగర్ వ్యాధి గ్రస్తులు వ్యాధి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి పరిరక్షించుకోవచ్చునని డాక్టర్ సురేఖ తెలిపారు. శనివారం స్థానిక మంగళం రోడ్డులోని తిరుపతి ట్రామా కేర్ సెంటర్ ఆస్పత్రి నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ సురేఖ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ప్రతి వారం డయాబెటిస్ ఫుట్ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంతో పాటు ఉచిత పరీక్షలు నిర్వహించి పాదాల పరిరక్షణ పట్ల తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శనివారం నిర్వహించి వైద్యశిబిరానికి స్థానిక ప్రజలు, రోగుల నుంచి విశేష స్పందన లభించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**తిరుపతి హెల్త్, మే 17 ప్రభాతవార్త :** సహస్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ శబరీష్ తెలిపారు. శనివారం మంగళం రోడ్డు లోని ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న సహస్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17వ తేది నుంచి 22వ తేది వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించి ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు, రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి నగర ప్రజలు, రోగుల నుంచి స్పందన లభించినట్లు ఆయన తెలిపారు.

## మ్యూజియంల భవిష్యత్తుపై ఉపన్యాసం

**తిరుపతి విద్య, మే 17 ప్రభాతవార్త**

ఎసీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రపంచ వస్తుప్రదర్శన శాలల దినోత్సవ సందర్భంగా వేగంగా మారుతున్న సమా జాలలో మ్యూజియంల భవిష్యత్తు అనే అంశంపై ప్రత్యేక ఆన్లైన్ ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సమకాలీన సమాజంలో మ్యూజియాల పాత్ర, స్వరూపంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పాండిచ్చేరికి చెందిన అరబిందో సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ మలపాక ఇందిర, చరిత్ర విభాగం హెచ్‌ఓడీ కే భాస్కర్, డాక్టర్ వినోద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర



**తిరుపతి విద్య, మే 17 ప్రభాత వార్త** స్థానిక బాలాజీ కాలనీలో ఉన్న ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో ప్రతి మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛాంధ్రపై అధ్యాపకులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలోని వాటర్ ప్లాంట్, త్రాగునీటి టాప్లతో పాటు కళాశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ భీమన్న, అధ్యాపకులు, హెచ్డీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కార్డియాలజిస్టు రాక

**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి ప్రజలకు ఎన్నో సంవత్సరాలు విశేష సేవలందించిన ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్, క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి. విజయకుమార్, మహిళా డాక్టర్ డాక్టర్ జిఎల్ అన్నపూర్ణలు ఆదివారం శ్రీకాళహస్తిలో వైద్యసేవలందించనున్నారు. శ్రీకాళహస్తిలో ఎన్నో సంవత్సరాల పాటు సేవలందించిన వారు నెల్లూరులో విజయకేర్ ఆసుపత్రిని నిర్మించి సేవలందిస్తున్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు నెలలో ఒక సారి ఇక్కడికి వచ్చి కార్డియాలజి సమస్యలపై అవగాహనతో పాటు వైద్యసేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు బిక్షాల గాలిగోపురానికి సమీపంలోని గుప్తా మెడికల్స్ వద్ద వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## గయాజ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంఎల్‌ఏ



**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో పట్టణంలోని 16వ వార్డుకు చెందిన మైనారిటి నాయకుడు గయాజ్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరులతో కలసి నివాళులర్పించారు. సంతాపం తెలిపారు. అలాగే కుటుంబాన్ని ఓదార్చారు. మైనారిటిలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సిరాజ్‌బాషా, గోరా, ఫరీద్‌ఖాన్ ఫజల్ గఫూర్, జీలాని, షర్మిలాఠాగూర్, జులేషా, జబ్బార్, అస్లం, రామచంద్రారెడ్డి, లీలా, శరవణ కుమార్, మున్నారాయల్, పెరుమాళ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నియమాలను పాటించండి : అప్రమత్తంగా వ్యవహరించండి

సెక్యూరిటి సిబ్బందికి డివైయస్‌పి సూచనలు



**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని వారి భద్రతతో పాటు ఆలయ భద్రత ఎంతో అవసరమని ఇక్కడ పని చేసే సెక్యూరిటి సిబ్బంది నియమని బంధనలను పాటించాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహామూర్తి సూచించారు. శనివారం సాయంత్రం ఆలయ సెక్యూరిటికి ఆలయానికి సమీపంలోని బ్రహ్మగుడి వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిఐయస్‌పి సూచనలతో వన్‌టౌన్ సిఐ డి. గోపి సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సిఐ గోపి సెక్యూరిటిలో పని చేస్తున్న వారి వివరాలను సేకరించారు. డివైయస్‌పి నరసింహామూర్తి మాట్లాడుతూ నేడు ఆలయాల వద్ద భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. భద్రత విషయంలో ఆలయంలో పనిచేస్తున్న సెక్యూరిటి పాత్ర కూడా ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులను సమగ్రంగా తనికీ చేయాలన్నారు. అలాగే అనుమానిత వ్యక్తుల పట్ల తీసుకోవాల్సి న జాగ్రత్తలను అలాగే ఎవరి మీద అయినా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు తెలపాలని సూచించారు.

## తుడా ఛైర్మన్ పదవి దివాకర్‌రెడ్డి ఇవ్వడం సముచితం



**తొట్టంబేడు, మే 17 ప్రభాతవార్త**

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్(తుడా) ఛైర్మన్ పదవి డాలర్స్ గ్రూప్ అధినేత టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి. దివాకర్‌రెడ్డికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌లు తుడా ఛైర్మన్ పదవిని ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నామని తొట్టంబేడు మండల తెలుగుదేశం నాయకుడు కన్నలి ప్రతాప్‌రెడ్డి, కన్నలి ప్రవీణ్‌రెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు.

## శివయ్య సేవలో కేంద్ర అధికారి

**శ్రీకాళహస్తి, మే 17 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామి దర్శనానికి శనివారం భారత రక్షణ సాంకేతిక సలహాదారు, మాజీ ఛైర్మెన్, డిఆర్‌డిఓ కార్యదర్శి, రక్షణ పరిశోధన, అభివృద్ధి విభాగం అధికారి జి. సతీష్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలసి వచ్చారు. వారికి దక్షిణ గోపురంవద్ద వేద పండితులతో ఆలయ ఇఓ డి. బాపిరెడ్డి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించిన ఆయన స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. ఏర్పాట్లను డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

## అర్హులైన పేదలందరికి ఇంటి పట్టాలు అందించండి

జెసికి ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



**నారాయణవనం/వరదయ్యపాలెం మే 17 ప్రభాతవార్త :** సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అర్హత కలిగిన నిరుపేదలందరికి ఇంటి పట్టాలను అందించి ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని జాయింట కలెక్టర్ శుభం బన్సల్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలు సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, వదయ్యపాలెం, బుచ్చినాయుడుకండ్రిగ కెవిబిపురం మండలాల్లో అర్హులైనా ఇంటి స్థలం లేని నిరు పేదలందరిని గుర్తించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా వరదయ్యపాలెం మండలంలోని వానెల్లూరులో తుడా అప్రూవల్ ఎంఐజి లేఔట్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే వరదయ్యపాలెం మండలంలోని పేదలకు ఇంటి స్థలం అందించడం కోసం సర్వే చేసినప్పటికి ఇప్పటి వరకు పట్టాలు పంపిణీ చేయాలేదన్నారు. వరదయ్యపాలెం మండలంలోని బిసి బాలికల హాస్టల్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, కావున వెంటనే ప్రారంభించి నిరుపేద బిసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వినతి మేరకు జెసి మాట్లాడుతూ త్వరలో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్‌లో తహశీల్దార్లకు తెలియ పరిచి అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధార్‌కార్డు తప్పనిసరి : డిపిఎంఓ

**నారాయణవనం, మే 17 ప్రభాతవార్త :** ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చే రోగులు తమ వెంట తప్పక ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్‌ను తీసుకురావాలని డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఆఫీసర్(డిపిఎంఓ) డాక్టర్ పి శ్రీనివాసులు కోరారు. శనివారం మండలకేంద్రంలోని పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఈ డాక్టర్లు దర్శిత్‌రాజ్, రాగసుధ, సిహెచ్‌ఓ హరినాథ్, సిబ్బంది సుధాకర్, రమేష్, రోగులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని యువకుడు అనుమానాస్పద మృతి?



**రేణిగుంట మే 17 ప్రభాతవార్త** రేణిగుంట పట్టణ శివారు స్నేహ వినైల్ కర్మాగారం వద్ద గుర్తుతెలియని సుమారు 40 నుండి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకుడు మురికి కాలువలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయాన్ని శుక్రవారం సాయంత్రం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు మృతుడు మద్యం మత్తులో డ్రైనేజ్ కాలువలు పడ్డాడా? ఎవరైనా కాలువలో తోసేసారా? చంపి కాలువలో పడేశారా? అనే కోణంలో పోలీసులు బిఎన్ఎస్ఎస్ 194 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. యువకులు శరీరం బాగా ఉబ్బి దుర్గంధం వెదజల్లుతోంది. మృతుడు బ్లూ రంగు నల్లని గీతలు గల ఫుల్ షర్టు, వక్క రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతిని మెడలో స్టీల్ చైన్, కుడి చేతికి స్టీల్ కడియం వేసుకొని ఉన్నాడు. రేణిగుంట అర్బన్ పోలీసులు సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పరీక్ష నిమిత్తం శనివారం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

## ఎంపీడీవో గారు రోడ్డు మరమ్మతు చేయించండి

**రేణిగుంట మే 17 ప్రభాతవార్త** రేణిగుంట నుండి అన్నాసంపల్లి మీదుగా వెంకటాపురం వెళ్లే రోడ్డును మరమ్మత్తులు చేయించాలని బిజెపి యువనేత, ఓ బి సి యువసేన రాష్ట్ర అధ్యక్షులు వెంకటాద్రి యాదవ్ ఎంపీడీవో విష్ణు చిరంజీవికి శనివారం వినతిపత్రం సమర్పించారు. రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిపోయింది అన్నారు. వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మార్గంలో రేణిగుంట నుండి ఎంతోమంది విద్యార్థులు, వృద్ధులు నడక సాగిస్తారని రాత్రి సమయాల్లో గర్భవతులను ఆసుపత్రులకు తీసుకెళ్తారని అన్నారు. మార్గంలో రాత్రి వేళల్లో చాలావరకు చీకటిగా ఉంటుందన్నారు. చుట్టుపక్కల పొలాలు ఉండడం వల్ల విష కీటకాలు రోడ్డుపైన సంచరిస్తున్నాయని తెలిపారు. మార్గంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

## స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్రలో అందరూ భాగస్వాములే....



**రేణిగుంట మే 17 ప్రభాతవార్త** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పరిశుద్ధంగా ఉంచడంలో భాగంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర... స్వచ్ఛ ఆంధ్ర లో రాష్ట్ర పౌరులంతా భాగస్వా మ్యంకావాలని వివిధ శాఖలకు చెందిన అధికారులు పిలుపు నిస్తూ రేణిగుంటలో శనివారం ర్యాలీ చేపట్టారు. ర్యాలీ పట్టణంలోని అన్ని వీధులలో సాగింది. ర్యాలీకి ప్రాతినిధ్యం వహించిన రేణిగుంట డిఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ విధులను, గ్రామాలను, పట్టణాలను శుభ్రంగా ఉంచుకోవాల్సి న బాధ్యత ప్రతి పౌరుని పై ఉందన్నారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నాగేశం, అర్బన్ ఎస్పై అరుణ్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణి, టిడిపి నాయకులు రాష్ట్ర వడ్డెర సంఘం కార్యదర్శి దేవల్ల రమణ, ఎంపీడీవో కార్యాలయఉద్యోగులు, తాహసిల్దార్ కార్యాలయం ఉద్యోగులు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

## శ్రీ కట్ట పుట్టలమ్మ హుండీ ఆదాయం 9 లక్షలు



**రేణిగుంట మే 17 ప్రభాతవార్త** రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవస్థానం హుండీ ఆదాయం 8,88,750 వచ్చిందని శనివారం గుడి ఛైర్మన్ పాడి రాజేంద్ర తెలిపారు. గత కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఆలయ కమిటీ ఏర్పడింది. తారకరామా నగర్ కార్యదర్శి రమేష్ బాబు, రేణిగుంట మండల తారక రామా నగర్ క్లస్టర్ ఇంచార్జి బుజ్జి నాయుడు సమక్షంలో ఆలయ చైర్మన్ పాడి రాజేంద్ర, కార్యదర్శి మోహన్, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు సుధాకర్, కె వి చలం, రమ, నారాయణ, సుబ్రహ్మణ్యం, మునిరాజా, మునయ్య, హరికృష్ణ, పలువురు భక్తులు సాక్షులుగా గత నాలుగు నెలలుగా భక్తులు వేసిన డబ్బులను హుండీని తెరిచి లెక్కించారు. హుండీ ద్వారా 8,88,750 రూపాయలు ఆదాయంగా వచ్చిందని కమిటీ నిర్ధారించింది.

## చెట్లునాటి పర్యావరణాన్ని కాపాడుదాం



**తిరుపతి(రవాణ), మే 17(ప్రభాతవార్త:** కాలుష్యం నియంత్రణ, సూర్యవేడిని తగ్గించేందుకు విరివిగా మొక్కలునాటాలని తిరుపతి రవాణాశాఖ జిల్లా అధికారి (ఆర్‌టిఓ)కొర్రపాటి మురళీమోహన్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటితే పచ్చదనంతో బాటు పర్యావరణం పరిరక్షణ జరుగుతుందన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ఉదయం ఆర్‌టిఓ కార్యాలయం ప్రాంగణం లో మొక్కలు నాటారు. వేడినుండి భూమిని కాపాడు కోవడానికి పచ్చనిచెట్లు విరివిగా ఉండాలన్నారు. ఈ సందర్భం గా మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యమ్రంలో ఎంవిఐలు, ఆర్‌టిఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ భారత్

**తొట్టంబేడు, మే 17 ప్రభాతవార్త** మన చుట్టు ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం కూడా ఎలాంటి వ్యాధులు లేకుండా ఉంటాయని టుటౌన్ సిఐ నాగార్జునరెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతినెలా మూడోశనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ నాగార్జునరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, రమేష్, కానిస్టేబుళ్ళు సుబ్రమణ్యం, బాబు, నంద, అరుణ్, సుదర్శన్‌లు కలసి టుటౌన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రం చేసి వ్యవర్థాలను కాల్చివేశారు.

## భారత సైన్యానికి మద్ధతుగా ర్యాలీ

**సత్యవేడు, మే 17 ప్రభాతవార్త:** దేశ ప్రతిష్టను కాపాడుతూ ముష్కరులను అంతం చేసే క్రమంలో శక్తివంచన లేకుండా పాటు పడుతున్న భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తూ టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో సత్యవేడులో గడియార స్తంభం కూడలి వద్ద నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ ముష్కరులు చేతిలో ప్రాణాలను కోల్పోయిన అమాయక భారత పౌరులకు నివాళులర్పిస్తూ ప్రతికార చర్యగా ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాదాన్ని, ముష్కరులను హతం చేసిన భారత వీర జవాన్ల కృషిని భారత సత్తా చాటిన జవాన్ల వీరోచిత పోరాటం దేశం గర్వించదగినదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, హేమభూషణం, రాధయ్య, శివయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన



**తొట్టంబేడు, మే 17 ప్రభాతవార్త** మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మరియు గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలతో మమేకమై చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అలాగే ప్రతిజ్ఞచేసి ఆరోగ్యం, పరిశుభ్రతపై గ్రామసభలు నిర్వహించారు. ఈపర్యవేక్షణలో భాగంగా తొట్టంబేడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. సురేంద్రనాథ్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీలు అభివృద్ది చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓతో పాటు తహశీల్దార్ మధుసూధనరావు, తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, సంబందిత పంచాతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి బావిలో మునిగి యువకుడు మృతి

రేణిగుంట మే 17 ప్రభాతవార్త:రేణిగుంట పట్టణం జ్యోతి నగర్‌కు చెందిన ఆంథోనీ సుసైన్ మామండూరు వ్యవసాయ బావిలో మునిగి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రేణిగుంట జ్యోతి నగర్ కు చెందిన ఆంథోనీ సూసైన్ తన మిత్రులతో కలిసి మామండూరు సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు మునగడానికి వెళ్ళాడు. బావి వద్ద మిత్రులతో కలిసి బీరు తాగి, చికెన్ పకోడా తిని బావిలో మునుగుతుండగా ఆంథోనీ సుసైన్ ప్రమాదవశాత్తు బావిలో మునిగిపోయాడు. అతని స్నేహితులు కాపాడ్డానికి ఎంత ప్రయత్నించినా వారి ప్రయత్నాలు ఫలించలేదు. చీకటి పడటంతో అందరూ వచ్చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా అతను కనిపించలేదు. బావిలోపల పూడికలో ఇరుక్కుపోవడం వల్ల పైకి రాలేక పోయి ఉండొచ్చునని రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు అర్బన్ ఎస్పై అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో శనివారం సంఘటనా స్థలం చేరుకొని బావిలో మునిగిపోయి మృతి చెందిన అతనిని తాళ్ల సహాయంతో బయటకు తీశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పరీక్ష నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు.

# తిరుపతి డివిజన్

## పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

కమిషనర్ మంజునాథ్ గౌడ్



**పుత్తూరు, మే 17 ప్రభాతవార్త :** స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారంపలుకార్యక్రమాలు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ స్థానిక మార్కెట్‌లో పర్యటించి మాస్ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. తడి, పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని వ్యాపారులకు సూచించారు. మునిసిపల్ ఆఫీస్ పరిధిలో చెట్లు నాటించారు. పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పాత మునిసిపల్ ఆఫీస్‌లో పారిశుధ్య కార్మికులకు, వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. పారిశుధ్యం, పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యం వుంటే మంచి ఫలితాలు సాధించగలమని దీనికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిఇ చంద్రశేఖర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అండర్ 19,23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

- సిడిసిఏ అధ్యక్ష కార్యదర్శులు విజయ్ కుమార్, రవికుమార్



**తిరుపతి క్రీడ, మే 16, ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సిడిసిఏ) ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ వర్షం కారణంగా తిరుపతిలో రద్దయిన అండర్ 19,23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్‌ను 18వ తేది ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు సిడిసిఏ అధ్యక్షులు విజయకుమార్ (క్రికెట్ విజయ్), కార్యదర్శి రవికుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వాల్మీకిపురం, తిరుపతి రెండు జోన్లలో క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించగా తిరుపతి సెలక్షన్స్ వర్షం కారణంగా రద్దవడం జరిగిందన్నారు. ఈ మేరకు మే 18 ఆదివారం తిరుపతి స్థానిక మంగళం రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా ఉన్న సీవీ క్రికెట్ అకాడమీలో ఉదయం 9 గంటలకు అండర్ 19,23 మెన్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో హాజరగు క్రీడాకారులు అండర్ 19 (1.9.2006) అండర్ 23 (1.9.2002) తరువాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామాగ్రితో పాటు ఆధార్ కార్డు, జన్మ ధ్రువీకరణ పత్రము తప్పక తీసుకురావాలని సూచించారు. వివరాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా కోచ్ సునీల్ కుమార్ 9000214966, సిడిసిఎ జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్ 8886185559 నెంబర్ల ద్వారా సంప్రదించవలసిందిగా వారు కోరారు.

## శ్రీ సద్గురు త్యాగరాజస్వామి వారి సంగీత కచ్చేరి



**పాకాల, మే 17, ప్రభాతవార్త** పాకాల మండలం స్థానిక నాయి బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి ఏడవ సంగీత కచేరిలో భాగంగా ఈ నెల 19 వ తేదీ సోమవారము రోజు ఉదయం 6 గంటలకు శ్రీ సత్యమ్మ అమ్మ వారారి గుడి నుంచీ మొదలై త్యాగరాజ స్వామి వారి చిత్ర పట మును పాకాల నగర పుర వీదుల గుండా మేళ తాళాలతో మంగళ వాయిద్యాల మదుమ ఊరేగింపుగా సాగి పాకాల రైల్వే కళ్యాణ మండపంనకు చేరునని, తదుపరి సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు నాదస్వర కచేరి, పది గంటల నుంచి తెల్లవారు జామున వరకు కేరళ సంగీత విద్వాంసులచే గొప్ప వాయిద్య కారులచే కచ్చేరి కార్యక్రమంతో మునియనుందని సంఘం వారు కోరుతున్నారు.

## శ్రీవారికి వైభవంగా గ్రామోత్సవం



**వడమాలపేట, మే 17 ప్రభాతవార్త:** అప్పలాయగుంటలో అభయహస్తంతోవెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులు సర్వదర్శనం చేసుకున్నారు. 3 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు ఊయలలో కొలువుదీరి గంటపాటు చిద్విలాసంగా ఊయల లూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించగా భక్తులు ధూపదీప నైవేద్యాలు, నారికేళాలు స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి అంటేనే కూటమి ప్రభుత్వందే : కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు

**సత్యవేడు, మే 17 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గంలో గత ఐదేళ్ళ వైసీపీ హయాంలో అక్రమాలు అరాచకాలు తప్ప అభివృద్ధి లేదు. గత వైసీపీ హయాంలో రోడ్ల మీద తట్టడ మట్టి వేసిన వేయని మీరా నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు, సమన్వయకర్త శ్రీపతిబాబులు అన్నారు. ఇటీవల వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కూటమి ప్రభుత్వంపై విమర్శించిన నేపథ్యంలో శనివారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఘాటుగా స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో టిప్పర్ల దాటికి నాగలాపురంనుంచి పీవీ పురం, కన్నవరం, అల్లాగుంట, లాంటి నియోజకవర్గంలోని పలు రోడ్లు పూర్తిగా ధ్వంసమైన గత ఐదేళ్ల రోడ్లను ఎందుకు అభివృద్ధి చేయలేదనిఆయన విమర్శిం చారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఆరు నెలల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 25 కోట్లతో నియోజకవర్గంలో పలు గ్రామీణ రోడ్లు, శ్మశనాలు, పశువులకుతుట్లు, గోశాల, వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, సత్యవేడు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పిచ్చాటూరు రాష్ట్ర వాణిజ్య విభాగ పద్మనాభంరాజు, మండలఅధ్యక్షులుతిరుమలరెడ్డి, పాల్గొన్నారు.


**IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) CHITTOOR**
**I.P. NO. 21 OF 2024**

Between:
M.Hari Prasad ...Petitioner
And:
A.Vijayalakshmi & others ..Respondents

**NOTICE TO THE RESPONDENT NO.1 to 3**

To
**1.A. Vijayalakshmi**, W/o A.Sidda Reddy, aged about 30 years, Hindu, Ration Dealer, residing at Vepangeri Village and Post, Gangadhara Nellore Mandal, Chittoor District,
**2.Munirathnam Reddy**, S/o Muni Reddy, aged about 63 years, Hindu, cultivation, residing at Chennareddi palli Village, Vepangeri Village Post, Gangadhara Nellore Mandal,Chittoor Dist
**3.M.Ananda Reddy**, S/o M.Chinna govinda Redy, 54 years, Cultivation, Chinnavepanjeri village,GD Nellore mandal,Vepanjeri post. Chittoor District,
**Sir,** The petitioner has filed the above Insolvency petition against you all seeking relief of adjudging the respondents as insolvent and to appoint the Official Receiver directing him to take physical possession of the petition schedule property by annulling the same as null and void. Please take notice that the above case now stands posted to **08.07.2025** for your appearance and for tiling objections. On that day you shall appear personally or through an advocate at **10.30 AM** before the said Hon'ble Court. In spite of this notice if you fail to appear and file your objections the matter will be decided Ex-parte in your absence.
**(By the order of the Hon'ble Court)**

**A. MURALI MOHAN**
Advocate for Petitioner



కెనరా బ్యాంక్ Canara Bank — గూడూరు శాఖ, గూడూరు, తిరుపతి జిల్లా ఫోన్: 94409 05262

**రుణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**రిడెంప్షన్ నోటీసు**

**టు: రుణగ్రహీత:శ్రీ ఆవుల వెంకటరావు,** తండ్రి ఆవుల శ్రీనివాసరావు, డి.నెం. 1/427-1, మాలబ్య నగర్, గూడూరు, నెల్లూరు
అయ్యా/ అమ్మా !
**విషయం: సర్ఫేసి చట్టం, 2002లోని సెక్షన్ 13(8) క్రింద ప్రకారం విముక్తి హక్కును అమలు చేయడం కోసం నోటీసు**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదీకి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.

రుణఖాతా **శ్రీ ఎ.వెంకటరావు (రుణగ్రహీత)** వారిని బకాయి **రూ.1,98,746.00 (ఒక లక్ష తొంభై ఎనిమిది వేల ఏడు వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరాబ్యాంక్, గూడూరు శాఖ** యొక్క అధీకృత అధికారి **01.12.2018** వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **తేది: 11.02.2019** న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా / భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. మరియు చట్టం ప్రకారం సదరు స్వాధీనతా నోటీసును **వార్త (తెలుగు) మరియు ది హాన్స్ ఇండియా (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది: 14.02.2019** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది:01.12.2018 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తం **రూ.1,98,746.00 (ఒక లక్ష తొంభై ఎనిమిది వేల ఏడు వందల నలభై ఆరు రూపాయలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం కల్పించడమైనది. ఒక వేళ మీరు చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ వివరించి ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తును కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ఒప్పందం ద్వారా. దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు కలిగి ఉంటారు. ఒక వేళ విఫలమైనచో, సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకునే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోవున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంకును ఏలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

స్థలం : గూడూరు
తేది: : 12.05.2025

సం॥ అధీకృత అధికారి,
కెనరా బ్యాంక్

## ఎండల తీవ్రతపై అవగాహన కలిగి ఉండాలి: ఎమ్మెల్యే పాశం

గూడూరు, మే 17, ప్రభాతవార్త




ఎండల తీవ్రత పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని స్థానిక టవర్ క్లాక్ సెంటర్ ప్రాంతంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా హీట్ ద బీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించి, ఎండ తీవ్రతకు గురికాకుండా తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ తమ పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు ఆహారం, నీరు అందిస్తూ వాటిని రక్షించాలని, వేసవికాలంలో ఎండ తీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలు మరియు జాగ్రత్తలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అధికారులు అవగాహన కల్పించాలని తెలియజే శారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, ప్రజలకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను అందజేసి, సి.వి.సి పార్కులో పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డి.ఎస్.పి గీతా కుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, పేటేటి చంద్ర నీల్, నయుం, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పాకిస్తాన్ గుండెల మీద తన్నిన భారత్ సైనికులు

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ




వెంకటగిరి, మే 17, ప్రభాతవార్త

పాకిస్తాన్ గుండెల మీద భారత సైనికులు తన్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆపరేషన్ సింధూర కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా వెంకటగిరి పట్టణ పురవీధుల్లో కూటమి నాయకులు, సివిల్, బెటాలియన్ పోలీసులు, పట్టణ ప్రజలు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టే విధంగా భారత ప్రభుత్వం చేసిందని తెలిపారు. పాకిస్థాన్కు ఆపరేషన్ సింధూరు ద్వారా తగుములపాఠం చెప్పారని తెలిపారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ పాకిస్తాన్ ఎత్తులను భారత సైన్యం తిప్పి కొట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ జి నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వరరావు, జనసేన నాయకులు ప్రకాష్, అనిల్ కుమార్ తోట కృష్ణయ్య, టిడిపి నాయకులు సత్యనారాయణ విశ్వనాథం, మండల పార్టీ అధ్యక్షులు రాయ్ మస్తాన్ నాయుడు, పప్పు చంద్రమోళి రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి ఎండిఓ కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర స్వచ్ఛాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి

కోట, మే 17 ప్రభాతవార్త




ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ప్రజలు ప్రజాప్రతినిదులు భాగస్వాములు కావాలని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చెందోడు, కోట, వెంకన్నపాలెం, నెల్లూరుపల్లి కొత్తపాలెం, జరుగుమల్లి, అల్లంపాడు, కొత్తపట్నం, కర్లపూడి తదితర గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు నెలల్లో మనం ఈ-చెత్త, ఇంటింటా చెత్త సేకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మే నెలలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, బీట్ ద హీట్ అనే నినాదంతో ముందుకెళుతున్నామన్నారు. చెందోడు గ్రామంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, రాజశేఖర్, రియాజుద్దిన్, సుమలత, ప్రజాప్రతినిదులు బాలసుబ్రహ్మణ్యం, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోమిడి గ్రామంలో స్థానికుల ఆందోళన

చిల్లకూరు, మే 17, ప్రభాతవార్త



మోమిడి గ్రామంలో రహదారి మార్గంలో ఏర్పాటైన కల్వర్టు కు చేపట్టిన మరమ్మత్తులు సక్రమంగా చేపట్టక పోవడంతో తరచూ వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని, మరమ్మత్తులకు గురవుతున్నాయని మోమిడి గ్రామస్థులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఓ లారీ మరమ్మతులకు గురై నిలిచిపోయింది. ఆ ప్రాంతంలో గ్రావెల్ సక్ర మంగా త్రోలకపోవడంతో కల్వర్టు రోడ్డు పైకి తేలి ఉన్నట్లుగా తయారవడంతో రహదారి సాఫీగా లేక వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## గంధమహోత్సవ గోడ పత్రికల ఆవిష్కరణ

గూడూరు, మే 17, ప్రభాతవార్త:



గూడూరు పట్టణంలో వెలసిన హజరత్ సయ్యద్ హోషిం హుస్సేని ఔలియా వారి గంధమహోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం దర్గా ఆవరణంలో దర్గా కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులతో కలిసి గోడ పత్రికల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉర్దూ నెల బక్రీద్ మాసంలో హజ్రత్ సయ్యద్ హోషిమ్ హుస్సేనీ ఔలియా వారి గందమహోత్సవం జరుగుతుందని ముందుగా ఈనెల 28వ తేదీ బుధవారం సాయంత్రం ఏడు గంటలకు నిషాన్ జెండా కార్యక్రమం జరగనుందని 31వ తేదీ శనివారం రాత్రి తొమ్మిది గంటలకు చందన సేవ కార్యక్రమం ఉంటుందని ముఖ్యంగా జూన్ రెండో తేదీ సోమవారం గంధమహోత్సవం జరగనుందని తెలియజేశారు. భక్తుల సౌకర్యార్థం దర్గా ఆవరణంలో నిషాన్, గంధమహోత్సవం రోజున దర్గా ఆవరణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రముఖ దర్గాల నుండి మత గురువులు పీఠాధిపతులు విచ్చేయనున్నారని ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు మొహమ్మద్ మగ్దూమ్, షేక్ షానవాజ్,మొహమ్మద్ అన్వర్, యస్దాని, షేక్ షబ్బీర్, సైదు, గోల్డెన్ గౌస్, షాకీర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో మండల పరిషత్

చిట్టమూరు, మే 17, ప్రభాతవార్త

17 కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చిట్టమూరు మండలంలో పలువురు అధికారులు సచివాలయ సిబ్బంది నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో అద్దిపూడి పంచాయతీలో పశువులకు ఏర్పాటుచేసిన నీటి తొట్టెలను పరిశీలించారు. పంచాయతీ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను వేరివేసి గ్రామ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అలాగే చిట్టమూరు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## నాయకులు,కార్యకర్తలతో నేదురుమల్లి భేటీ

వాకాడు, మే 17, ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ బలోపేతంకు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని వెం కటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వాకాడులోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని శనివారం వాకాడు, చిట్టమూరు, కోట మండలాల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో స్థానిక రాజకీయలను గురించి సమీక్షించారు. అనంతరం నేదురుమల్లి మాట్లాడుతూ భారతదేశ వ్యూహాత్మక సత్తాను ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి చాటి చెప్పిందని తెలిపారు. ఇక 2027లో జెమిలి ఎన్నికలు రావడం తధ్యమన్నారు. ఆ ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. సమావేశంలో వాకాడు ఉపసర్పంచ్ పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఏఎంసి డైరెక్టర్ వాకాటి జనార్దన్ రెడ్డి, నాగూర్ రెడ్డి, షనిల్ రెడ్డి, గూడూరు సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలి

### - జూనియర్స్ జడ్జి విష్ణువర్మ

వెంకటగిరి, మే 17, ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. వెంకటగిరి కోర్టు ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. పరిసరాలను శుభ్రపరిచారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే వాటిని సంరక్షించాలని సూచించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లికి వందనం వచ్చేస్తోంది

కోట, మే 17 ప్రభాతవార్త



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుందగా, విద్యార్థుల చదువుల కోసం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడానికి రంగం సిద్ధం చేసింది. కోట మండలంలో 9,600 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులని ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలు ప్రకటించారు. ఇందులో తల్లికి వందనం పేరిట ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఉన్నారు. ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు కూడా చేశారు. జూన్ 12వ తేదీలోగా ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు సీఎం ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## గూడూరు రైల్వే స్టేషన్ పడమర వైపు గుర్తు తెలియని వ్యక్తి మృతి

గూడూరు, మే 17, ప్రభాతవార్త

రైల్వే స్టేషన్ పడమర వైపు నార్త్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి (70) మృతదేహం గురించి ఈ రోజు ఉదయం గూడూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి. గోపాల్‌కి సమాచారం అందింది. మృతుడు 16వ తేదీ సాయంత్రం నుండి 17వ తేదీ ఉదయం మధ్య ఏదైనా సమయంలో మృతి చెందినట్లు తెలుస్తున్నది. చుట్టూ ప్రక్కల ప్రజల అభిప్రాయం ప్రకారం, మృతుడు గత కొంత కాలముగా గూడూరు రైల్వే స్టేషన్ పరిసరాల్లో బిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని, ఆయన దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని స్థానికులు తెలియజేశారు. మృతుని శవమును గూడూరు మార్చురీ రూమ్‌లో బద్రపరచి వున్నదని తెలిపారు. మృతుని కుడి చేతిపై జయలక్ష్మి అని పచ్చబొట్టు వున్నది. పసుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడు కాషాయపు రంగు పంచె కట్టుకున్నాడు . ఎవరికైనా సమాచారం ఉంటే, గూడూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే

వాకాడు, మే 17, ప్రభాతవార్త



వాకాడు గ్రామంలోని శనివారం నిర్వహిస్తున్న సర్వేపై ఎంఈఓ నసీమ్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్యను అందు బాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు, వివిధ అలవెన్సులను సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్నామని వివరించారు. ప్రత్యేక అవసరాల గల బడిఈడు పిల్లలు ఉంటే వాకాడులో వున్నా భవిత పాఠశాల కేంద్రానికి తీసుకురావాలని తల్లిదండ్రులను కోరారు. వారి వ్యక్తిగత వికాసానికి తోడ్పడుతామని ఆయన తెలిపారు. భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు వస్తుందన్నారు. ఎంతోమంది విద్యార్థులకు ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యా యులు నైపుణ్యాలతో విద్యావంతులను చేశారన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన బడి ఈడు పిల్లలు భవిత కేంద్రంలోనే ఉండాలని, అప్పుడే వారు మానసికంగా అభివృద్ధి చెందుతారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐ ఈ ఆర్టీలు సునీత, జగన్ మోహన్ రావు తదితరులు ఉన్నారు.

## పరిసరాల ప్రాంతాలలో చెత్త శుద్ధి సేకరణ

వాకాడు, మే 17, ప్రభాతవార్త: వాకాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెత్త, ప్లాస్టిక్ సేకరణ, కార్యక్రమను నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా మన ఇంటితో పాటు రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ తాసిల్దార్ సందీప్ కుమార్, వాకాడు పంచాయతీ కార్యదర్శి ప్రవళిక చెట్లను నాటారు. అంతకు ముందు స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పోలిశెట్టి గుట్టను ట్యాంక్ బండ్ వలే అభివృద్ధి చేస్తా

### - ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మే 17, ప్రభాతవార్త



పట్టణంలోని పోలిశెట్టి గుంటను మినీ ట్యాంక్ బండ్ మాదిరి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. రెండు కోట్ల రూపాయలతో వెంకటగిరి పట్టణంలోని పోలిశెట్టి గుంట అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోలిశెట్టి గుంట అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ట్యాంక్ బండ్ పైన దేశ నాయకుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వెంకటగిరి ప్రజల కోసం ట్యాంక్ బండును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిడిపిఓ శంషాబాద్ బేగం, సిఐ ఏవి రమణ,మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, దొంతు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

బాలాయపల్లి, మే 17, ప్రభాతవార్త



మండల నూతన ఎంపిడిఓగా కె.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఓగా పనిచేస్తూ పదోన్నతిపై బాలాయపల్లి ఎం ి డిఓగా బాధ్యతలు చేపట్టారు.బాలాయపల్లి ఇంచార్జి ఎంపిడిఓగా ఉన్న డి.జె. వినీల్ కుమార్ ఏఓగా యధా విధిగా విధులు నిర్వహిస్తారు. ఎంపిడిఓ కె. శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా ఎంపిపి గూడూరు భాస్కర రెడ్డి, కార్యాలయ సిబ్బంది కలిశారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి : ఎంపీడీవో

వెంకటగిరి, మే 17, ప్రభాతవార్త



మొక్కలు నాటే పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో కె.వి కోటేశ్వరరావు స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలపాడు గ్రామంలో ఆయన మొక్కలు నాటారు. పశువుల తాగు నీటి తొట్టెలను పరిశీలించారు. వేసవి కాలంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో బీట్ ద హీట్

సూళ్లూరుపేట, మే 17 ప్రభాతవార్త



రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టిన బీట్ ద హీట్ కార్యక్రమాన్ని శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కమిషనర్ చిన్నయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటికి అవగాహన కల్పించడం, ట్రాఫిక్ కూడళ్లలో గ్రీన్ నెట్లతో షెడ్ నెట్లు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. వేసవి తాపాన్ని తట్టుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే తెలుసుకుని హెల్త్ క్యాంపుల ద్వారా ప్రజలకు మందులు పంపిణీ చేశారు. వేసవిలో పక్షుల కోసం అక్కడక్కడా మంచినీరు ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని కమిషనర్ చిన్నయ్య విజ్ఞప్తి చేశారు.

## ముస్లిం మైనార్టీలకు రాయితీ రుణాలు

కోట, మే 17 ప్రభాతవార్త

ముస్లిం మైనార్టీలకు, క్రిస్టియన్లకు రాయితీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఓ దిలీప్ కుమార్ చెప్పారు. కోట మండలంలో ముస్లిం మైనార్టీలు, క్రిస్టియన్లకు ప్రభుత్వం రాయితీ రుణాలు సబ్సిడీ కింద ఇస్తుందని చెప్పారు. అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

## పోలీసుస్టేషన్‌కు చేరిన పది ప్రశ్నాపత్రాలు

కోట, మే 17 ప్రభాతవార్త :కోట మండలంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆ మేరకు శనివారం 10వ తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు కోట పోలీసుస్టేషన్‌కు చేరాయి.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం

బాలాయపల్లి, మే 17, ప్రభాతవార్త




ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు పురవీధుల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ అంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీ చేపట్టిన ఎంపీడీవో డి.జె.వినీల్ కుమార్, ఎస్సై కామినేని గోపి, తహసీల్దార్ విజయలక్ష్మి, వైద్యాధికారిణి లియో, వెలుగు ఎపిఎం పోలమ్మలు మానవహారం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసిన పంచాయతీ కార్యదర్శులు లీలావతి, మోహన రాజు, ఏపిఎం పోలమ్మ, బిజెపి నేతలు దొమ్మరాజు ప్రశాంతి, సుధాకర్ రాజు, ఎస్ఐ గోపిలు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో డి.జె.వినీల్ కుమార్ కోరారు. దుకాణాల వద్ద వీధులలో ప్లాస్టిక్ వ్యర్థాలను టీ కప్పులను తొలగించాలని తహసిల్దార్ విజయలక్ష్మి తెలిపారు.

## హెలిప్యాడ్..సిఎం నివాసాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

కుప్పం, మే 17 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 21వతేది కుప్పం వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో శనివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కుప్పంలో పర్యటించి హెలిప్యాడ్, సిఎం నివాసాన్ని పరిశీలించారు. ద్రవిడ వర్సిటీలో ఉన్న హెలిప్యాడ్‌తో పాటు మఠం వద్ద గల హెలిప్యాడ్‌ను సైతం ఎస్పీ పరిశీలించారు. అనంతరం శాంతిపురం మండలం కదిరిఓబనపల్లి వద్ద సిఎం చంద్రబాబునాయుడు సొంత ఇంటి వద్ద పరిసర ప్రాంతాలు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఎస్పీ పార్థసారథి, ఎస్సైలు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.75 కోట్లు ఆదాయం

కాణిపాకం, మే 17 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.75 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. శనివారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 26 రోజులకు గాను హుండీల ద్వారా 1,75,36,760 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 49 గ్రాముల బంగారు,ఒక కిలో 425 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 10,569 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 41,660 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 208 అమెరికా డాలర్లు, 112 సింగపూర్ డాలర్లు, 32 మలేషియా రింగిట్స్,170 యూఏఈ దినార్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి,ధనుంజయ, సూపరెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, హుండీ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## కియా కారెన్స్ క్లావిస్ కారు ఆవిష్కరణ

తిరుపతి విద్య, మే 17 ప్రభాత వార్త




చెన్నైబెంగుళూరు రహదారి నందు హోషిఖి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో శనివారం కియా కారెన్స్ క్లావిస్ కారు ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాధరెడ్డి, డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హోషిమారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సి. జగన్నాధ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు కియా నుండి విడుదలయిన కియా కారెన్స్ క్లావిస్ కారులో అత్యాధునిక సదుపాయాలతో ఇవ్వడం జరిగిందని తెలియజేశారు.ఫీచర్లు బలమైన 18 హైసెఫ్టీ ప్యాకేజీ ప్రమాణం బెస్ట్ ఇన్ సెగ్మెంట్ 26.62 డ్యూయల్ పానోరమిక్ డిస్ప్లేపానెల్.డ్యూయల్ పానె పానోరమిక్ సన్రూఫ్ బోస్ ప్రీమియం సౌండ్ సిస్టమ్ విత్ 8 స్పీకర్స్ 20 అటానమస్ ఫీచర్లతో అడాస్ లెవల్ 2.ఈ కారు 8 రంగులలో అందుబాటులో వుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కస్టమర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ కారు బుకింగ్ కొరకు సంప్రదించవలసిన సెల్ 8688829739.

## శ్రీవెంకటేశ్వర కాలేజ్ పార్మసీ విద్యార్థినికి గోల్డ్ మెడల్

చిత్తూరు రూరల్, మే 17 ప్రభాతవార్త:



చిత్తూరు నగరం మురకంబట్టు సమీపంలోని చిత్తూరు-తిరుపతి రోడ్డు ఆర్‌వి‌ఎస్.నగర్‌లోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ పార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థిని పి.లిఖిత్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా శనివారం బంగారుపతకం అందుకుంది. కళాశాలకు చెందిన బిఫార్మసి(2020-24) విద్యార్థిని పి.లిఖిత్‌రెడ్డి అనే విద్యార్థిని అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటిలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో యూనివర్సిటి చాన్సిలర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పథకాన్ని అందుకున్నారు. బంగారుపతకం అందుకున్న లిఖిత్‌రెడ్డిని కళాశాల ఛైర్మన్ రావూరి వెంకటస్వామి, వైస్ ఛైర్మన్ రావూరి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జ్యోతీశ్వరిలు, అధ్యాపకులు అభినందించారు.

## కన్నుల పండువగా స్నపన తిరుమంజనం

చంద్రగిరి, మే 17 ప్రభాతవార్త:



శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన సేవ కన్నుల పండువగా జరిపించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం నుండి వార్షిక వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. తదుపరి స్వామివారిని వసంత మంపడపానికి వేంచేపుచేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, పసుపు, చందనం, తేనె, కొబ్బరినీళ్ళతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఆలయ ఆవరణలో స్వామివారు తనదేవేరులతో ఊంజల్‌పై సేదదీరారు. 6 గంటల నుండి 7 గంటల వరకు తిరుచ్చి వాహనంపై అధిష్టించి తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ మునిరాజ, టెంపుల్ ఇన్స్పెక్టర్ మునికుమార్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

### - కమిషనర్ ఎన్. మౌర్య

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ధ హీట్ నినాదంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతలను తగ్గించేలా మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు, పశు పక్ష్యాదుల కొరకు నీటి తొట్టెల ఏర్పాటు, పారిశుద్ధ్య కార్మికులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, టోపీలను అందజేశారు. ప్రజలు, ఉద్యోగులు అందరూ వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని అన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ డెవలప్మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు అన్నా అనిత, రేవతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌లు పాల్గొన్నారు.